సాక్షి
సూర్యాపేట

బుధవారం ၊ 4 ၊ జనవరి ၊ 2023



గోవర్ధనగిరిధారిగా..
అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు ఉదయం మురళీకృష్ణుడిగా రాత్రి గోవర్ధన గిరిధారిగా దర్శనమిచ్చారు.
- 8లో



టీఆర్‌ఎస్ పాలనలో పెరిగిన అవినీతి
టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అవినీతి పెరిగిందని బీజేపీ నేతలు రేవూరిప్రకాష్ రెడ్డి, వెంకటేశ్వరరావు ఆరోపించారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/19.0°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తరుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంకు విద్యార్థుల ఎంపిక



లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : 2022–23 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంలో భాగంగా జిల్లాకు అదనంగా కేటాయించిన 270 సీట్లకు గాను ఖాళీ అయిన 56 సీట్లకు మంగళవారం కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన అదనపు కలెక్టర్ మోహన్‌రావు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ 100 సీట్లు, 5వ తరగతి రెసిడెన్షియల్ 170 సీట్లు అదనంగా కేటాయించగా గతంలో విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. అయితే వీరిలో 56 మంది పాఠశాలల్లో చేరక పోవడంతో ఆ ఖాళీలను భర్తీ చేయడానికి తిరిగి ప్రక్రియ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు



కలెక్టర్‌కు పంపిన ఫిర్యాదును చూపుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవం లేదని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని మట్టపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో సర్వే నంబర్ 540లో 46 ఎకరాల వంద కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. గతంలో అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టినా అక్రమార్కులు దానిని తొలగించి కబ్జా చేశారని దీని వెనుక ఎవరి హస్తం ఉందో ఆలోచించాలన్నారు. ఇక్కడ ఒక దోపిడీ వ్యవస్థ నడుస్తోందని ఆయన ఆరోపించారు. ఈవిషయంపై జిల్లా మంత్రికి, కలెక్టర్‌కు లెటర్ రాస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయాన్ని 6న హుజూర్‌నగర్ వస్తున్న మున్సిపల్ మంత్రి కేటీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో తన్నీరు మల్లిఖార్జున రావు, కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, రాజానాయక్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివి

నేరేడుచర్ల : సావిత్రీబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని డీఈఓ కె. అశోక్ అన్నారు. మంగళవారం నేరేడుచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే జయంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రునాయక్, నోడల్ ఆఫీసర్ కె. సైదానాయక్, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రావు, పరమేశం, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్, టీచర్లు అక్కయ్య బాబు, మాధవి, మజీదాబేగం, నర్సింహారావు, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సైదులునాయక్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, జహీంద్, విజయశేఖర్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎమ్ మేళా.. భళా



నూతనకల్ ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎమ్ మేళాను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మైనారిటీల సంక్షేమానికి కృషి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో మైనా రిటీల సంక్షేమానికి జిల్లా కమిటీ ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలంగాణ స్టేట్ మైనారిటీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ బడేసాబ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ మైనారిటీ ఉద్యోగులు ఐక్యతతో పనిచేస్తూ జిల్లాకు మంచి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఉద్యోగులు రుక్సానా, హబీబ్ మొహమ్మద్, అబ్దుల్లా, రఫీఉన్నిసా బేగం, అర్షద్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడిటేషన్‌తో సానుకూల మార్పులు

- రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్
- సైలెంట్ రిట్రీట్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరు



బ్రహ్మకుమారీస్ భవనంలో ఆధ్యాత్మిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళి సై

బీబీనగర్ : మెడిటేషన్ పవర్‌ఫుల్ ఆయుధమని, జీవన విధానంలో అనేక సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ అన్నారు. బీబీనగర్ మండలం మహాదేవ్‌పురం పరిధిలోని బ్రహ్మకుమారీస్ భవనంలో ఏర్పాటు చేసిన సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌ను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అద్భుతమన్నారు. అనంతరం సైలెంట్ రిట్రీట్ సెంటర్ శిలాఫలకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.అంతకుముందు బ్రహ్మకుమారీస్ భవనంలో ఏర్పాటు చేసిన స్పిరిచ్యువల్ మ్యూజియం, పంచధామాలు, కాన్ఫరెన్స్‌హాల్ తదితర వాటిని గవర్నర్ సందర్శించారు. కాగా గవర్నర్ వచ్చిన అరగంట తర్వాత కలెక్టర్ కార్యక్రమానికి వచ్చారు. దీంతో గవర్నర్‌కు ఆర్డీఓ భూపాల్‌రెడ్డి స్వాగతం పలికారు. గవర్నర్‌ను కలిసిన కలెక్టర్, అధికారులు.. కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రధాన



గవర్నర్‌ను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ దాది రతన్ మోహిని, జాయింట్ అడ్మినిస్ట్రేటివ్ సంతోష్‌దీదీ, ఢిల్లీ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్ ఆశాదీదీ, ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య, సర్పంచ్ వేణుగోపాల్, నిర్వాహకులు రాహుల్ దీదీ, సునీతదీదీ, సరళ పాల్గొన్నారు.

నీటి పన్నుపై నిర్లక్ష్యం

- వసూలైంది 34శాతమే
- రూ.2.43 కోట్ల బకాయి
- మిగిలింది మూడు నెలలే
- లక్ష్యసాధనకు చర్యలు చేపట్టని యంత్రాంగం



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీ	వసూలు లక్ష్యం	వసూలు చేసింది
హుజూర్‌నగర్	రూ.36లక్షలు	రూ.14లక్షలు
సూర్యాపేట	రూ.2కోట్లు	రూ.1కోట్లు
కోదాడ	రూ.1.12 కోట్లు	రూ.13 లక్షలు
తిరుమలగిరి	రూ.25 లక్షలు	రూ.3లక్షలు
నేరేడుచర్ల	నిల్	నిల్

సూర్యాపేట : నీటి పన్ను వసూళ్లలో మున్సిపల్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తికావొస్తున్నా నిర్దేశించుకున్న లక్ష్యానికి ఆమడదూరంలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 34శాతమే నీటి పన్నులు వసూలు చేశారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ రకాల మార్గాల ద్వారా మున్సిపాలిటీ పాలకవర్గాలు ఆదాయాన్ని సమకూర్చుకుంటాయి. ఇందులో ఆస్తి, వ్యాపార పన్నులతో పాటుగా నీటి సరఫరాకు పన్నులను వసూలు చేస్తుంటాయి. ఇలా వివిధ రూపాల్లో వచ్చే పన్నులను మున్సిపాలిటీలో అభివృద్ధి, ఇతర ఖర్చులకు వినియోగిస్తుంటారు. అయితే కొంతకాలంగా జిల్లాలోని మున్సిపాలిటీలు నీటి పన్నుల వసూలుపై అంతగా దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో రూ.కోట్లలో నీటి పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపాలిటీ పాలక వర్గాలకు ఆదాయం తగ్గిపోయి ఏ చిన్న అవసరానికైనా ప్రభుత్వం విడుదల చేసే నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

లక్ష్యం రూ.3.70 కోట్లు..

జిల్లాలోని సూర్యాపేట మున్సిపాలిటీలో 32వేల భవనాలు, కోదాడలో 12,873, హుజూర్‌నగర్‌లో 7,407, తిరుమలగిరిలో 6306, నేరేడుచర్లలో 3,663 భవనాలు ఉన్నాయి. ఈ భవనాలకు మున్సిపాలిటీల ద్వారా అందించే మంచినీటికి పన్నుల వసూళ్లలో అధికారులు, సిబ్బంది ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. సూర్యాపేటలో రూ.2కోట్ల లక్ష్యానికి గాను రూ.కోటి, హుజూర్‌నగర్‌లో రూ.36లక్షలకు గాను రూ.14 లక్షలు, కోదాడలో రూ.1.12 కోట్లకు కేవలం రూ.13 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇక తిరుమలగిరిలో రూ.25 లక్షలకు రూ.3 లక్షలు మాత్రమే వసూలు చేశారు. మొత్తంగా రూ.3.73 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయాలని మున్సిపాలిటీలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం రూ.1.30 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. రూ.2.43కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండడంతో లక్ష్యంలో 60 శాతం పన్నులు కూడా వసూలయ్యే అవకాశాలు కన్పించడం లేదు.

నాలుగేళ్లయినా..

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో కనీసం నీటి పన్నులకు సంబంధించిన లక్ష్యాలను అధికారులు విధించలేదు. ఈ మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లు కావొస్తున్నా ఒక్క పైసా నీటి పన్నులు వసూలు చేయకుండా కేవలం ప్రభుత్వం అందించే నిధులపైనే ఆధారపడుతోంది.

నీటి పన్ను వసూలు ఇలా..

మున్సిపాలిటీ పరిధిలో నల్లా కనెక్షన్ కోసం తెల్లరేషన్ కార్డు ఉన్న వ్యక్తి ఒక్క రూపాయి, పింక్ కార్డు ఉన్నవారు రూ.100, ఒకే ఇంటికి అదనపు కనెక్షన్ తీసుకుంటే రూ.7,400, దుకాణదారులైతే రూ.14వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ప్రతినెలా రూ.150 చొప్పున పన్ను చెల్లించి మున్సిపాలిటీ ద్వారా సరఫరా అయ్యే మంచినీటిని వాడుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీల పరిధిలోని అధికారులు ఈ నీటి పన్నుల వసూళ్ల విషయం పట్టించుకోవడంలేదన్న విమర్శలొస్తున్నాయి.

'కంటి వెలుగు'ను విజయవంతంగా నిర్వహిస్తాం

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈ నెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దయాకర్ రావు, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని 475 గ్రామపంచాయతీల్లో 616 క్యాంపులు ఏర్పాటు చేసి వందరోజుల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం 50 టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టీములో మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఆప్తమాలజిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఆశా వర్కర్లు ఉంటారన్నారు. ప్రతి క్యాంపులో ఆటో రిఫ్రాక్టోమీటర్, లెన్స్, కంటి చూపు పరిశీలించే పట్టిక, ఒక టార్చ్, అవసరమైన కంటి చుక్కల మందులు సిద్ధంగా ఉంచుతున్నట్లు కలెక్టర్ వివరించారు. వైద్య సిబ్బంది అందరికీ వాహనాలు, వసతి, భోజన సదుపాయాలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, తిరుమలగిరి మున్సిపల్ చైర్ పర్సన్ పోతరాజు రజనీకుమారి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



కోదాడ పట్టణంలో నిర్వహించిన ఖాతాదారుల ఆత్మీయ సమ్మేళనంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సుధా బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్ తదితరులు

- సుధాబ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్

కోదాడఅర్బన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సుధా బ్యాంక్ పనిచేస్తోందని బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సుధా బ్యాంకు ఖాతాదారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖాతాదారుల ఆత్మాభిమానాలతో సుధా బ్యాంకు అభివృద్ధి చెందుతూ వస్తోందని పేర్కొన్నారు. తమ బ్యాంకులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గృహాలకు సంబంధించి రుణాలు, బంగారంపై, వ్యక్తిగత రుణాలు కూడా తక్కువ వడ్డీకి అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఖాతాదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన చెప్పారు. అతి త్వరలో ఖాతాదారుల సౌకర్యార్థం డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, డైరెక్టర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

మట్టి నింపి.. విత్తనాలు పెట్టి..

- 475 గ్రామ నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరం
- తొమ్మిదో విడత హరితహారానికి కసరత్తు
- అందుబాటులో సుమారు 11 లక్షల మొక్కలు
- మరో 44 లక్షల మొక్కలు పెంచడానికి కార్యాచరణ ప్రణాళిక



చిలుకూరులోని నర్సరీలో మట్టితో నింపి సిద్ధంగా ఉంచిన బ్యాగులు

చిలుకూరు: ఈ ఏడాది జూన్‌లో నిర్వహించే తొమ్మిదో విడత హరితహారం కోసం అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీలో ఇప్పటికే కొన్ని మొక్కలు ఉండగా మరికొన్నింటిని పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకుసాగుతున్నారు.

ఈ నెలాఖరు నాటికి..

జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన ఎర్ర ఒండ్రు మట్టి, ఎరువుల మిశ్రమాన్ని మొక్కల సంచుల్లో నింపే పనులను ఉపాధిహామీ కూలీలు ప్రారంభించారు. కొన్ని చోట్ల విత్తనాలు నాటే పనులు సైతం చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అధికారులు గ్రామ నర్సరీలను సందర్శించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

మొలకువలు పాటిస్తూ. ..

నర్సరీల్లో మొక్కలు పెంచే క్రమంలో సరైన అవగాహన లేక చాలా చోట్ల మొలకలు రాక రెండో సారి విత్తనాలు నాటాల్సి వస్తోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారి అలా జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మొక్కలు సిద్ధం చేస్తున్నాం



అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉపాధిహామీ అధికా రులు, సిబ్బంది , కార్యదర్శులకు శిక్షణ, సలహాలు ఇస్తూ నర్సరీలు సిద్ధం చేస్తున్నాం. కనీసం ఒక గ్రామ నర్సరీలో 10వేల నుంచి 12 వేలు మొక్కలు పెంచాలని నిర్ణయించాం. అదే పనిలో ఉన్నాం.

–డాక్టర్ పెంటయ్య, అడిషనల్ పీడీ, డీఆర్‌డీఏ, సూర్యాపేట జిల్లా

ప్రతి గ్రామ పంచాయతీకి 10వేల మొక్కల చొప్పన..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏటా హరితహారం కింద మొక్కలు పెంపకం చేపడుతున్నారు. గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీకి కనీసం 10 వేల చొప్పున 55 లక్షల మొక్కలు పెంచాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది నర్సరీల్లో పెంచినవాటిలో 6,39,200 పెద్ద మొక్కలు, 4,48,020 చిన్న మొక్కలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రస్తుతం 44 లక్షలకు పైగా మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిల్లో ఇప్పటికే 41 లక్షల బ్యాగులు మట్టితో నింపి సిద్ధం చేశారు. టేకు, ఈత , వెదురు, మలబారు, మునగ, వెలగ, మర్రి, వేప, బాదాం, జామ , సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె తదితర మొక్కలు పెంచనున్నారు.

మత్స్యకారులకు బాసట

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సామూహిక ప్రమాద బీమా

- సహకార సంఘాల్లోని మత్స్యకార సభ్యులకు అవకాశం
- 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి వర్తింపు
- రూ.25 వేల నుంచి రూ.5లక్షల వరకు అందనున్న పరిహారం



భానుపురి (సూర్యాపేట) : మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బీమా పథకం ధీమాగా నిలవనుంది. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద సామూహిక ప్రమాద బీమాను అమలు చేస్తున్నాయి. ఇందుకోసం ఫిషరీస్ సొసైటీల్లో సభ్యులుగా చేరి, సర్టిఫికెట్ పొందిన వారి పేరున ఒక్కో సభ్యుడిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.68.04 చొప్పున బీమా ప్రీమియం చెల్లిస్తున్నాయి. 18 నుంచి 70 ఏళ్లలోపు మత్స్యకారులకు ఈ పథకం వర్తించనుంది. వీరు ప్రమాదంలో మృతిచెందితే బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యం బారినపడితే రూ.2.50 లక్షలు, ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరితే రూ.25 వేల పరిహారం అందుతుంది. సంఘటన జరిగిన తేదీ నుంచి 90 రోజులలోపు జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో లిఖిత పూర్వకంగా వివరాలు అందజేయాలి. అనంతరం 180 రోజుల లోపు పరిహారం మంజూరవుతుంది.

15,736 మంది సభ్యులు..

జిల్లాలోని 139 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 3 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, 5 మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 15,736 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది మార్చి 31వరకు సభ్యులుగా చేరిన 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. సంబంధిత మెంబర్లు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకుంటేనే బీమాకు అర్హులవుతారు. సర్టిఫికెట్ పొందని వారికి గ్రూప్ యాక్సిడెంట్ బీమా పథకం వర్తించదు.

పథకాన్ని వినియోగించుకోవాలి

మత్స్యకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రమాదబీమా పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ఏడాది మా ర్చి 31లోగా సంఘాల్లో చేరిన సభ్యులు పథకానికి అర్హులు. ఇందుకోసం జిల్లా మత్స్యశాఖ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ పొందాలి. అనుకోని సంఘటనలు జరిగితే రూ.25 వేల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం అందుతుంది. అర్హులైన సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రూపేందర్‌సింగ్, జిల్లా మత్స్యశాఖ అధికారి

పరిహారం ఇలా..

బీమా పథకం సర్టిఫికెట్ పొందిన సభ్యులు రోడ్డు, రైల్వే ప్రమాదాలు, సముద్రం, నదులు, చెరువులు, కుంటలు, వాగులు, మడుగులు, నీటికుంటల్లో మునిగి చనిపోవడం, గాయపడటం, తప్పిపోవడం, అగ్ని, విషపూరిత పదార్థాల కారణంగా ప్రమాదం, మెరుపు, విద్యుత్, మిషనరీలో పని చేస్తున్నప్పుడు, హత్య, ఎత్తు నుంచి పడిపోవడం, అల్లర్లు, పాము, తేలుకాటు, జంతువుల దాడిలో గాయపడడం, అవయవాలు కోల్పోవడం, మరణించడం, రేబిస్ తదితర వ్యాధులతో మరణించడం, ప్రమాదాలు జరిగినప్పుడు ఈ బీమా పరిహారం వర్తించనుంది. ప్రమాదానికి గురైన కుటుంబ సభ్యులు 90 రోజులలోపు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో వివరాలు అందజేయాలి. సంబంధిత శాఖ బీమా కంపెనీకి క్లెయిమ్ సమాచారం సమర్పించాల్సి ఉంటుంది. సరైన ధ్రువీకరణ పత్రాలు అందజేసిన సభ్యులకు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి ఆరు నెలల్లో పరిహారం అందుతోంది.

క్లుప్తంగా

బాలుడు అదృశ్యం


ఇలియాస్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోయిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డకు చెందిన షేక్ ఇలియాస్ (13) రోజు మాదిరి గానే సోమవారం స్కూల్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ కు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడు బ్లూ కలర్ ప్యాంట్, రెడ్, బ్లూ చెక్స్ చొక్కా కలిగిన స్కూల్ యూనిఫాం ధరించి ఉండి, సన్నగా నాలుగు అడుగుల ఎత్తు, ఛామనచాయ రంగులో ఉంటాడని పేర్కొన్నారు. గుర్తించిన వారు సమాచారం అందించాలని, పూర్తి వివరాలకు 98491 06766, 99599 92135 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

హుజూర్‌నగర్‌లో యువతి..


కొలపూడి కవిత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని తిలక్ నగర్ కాలనీలో మంగళవారం ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అదేకాలనీకి చెందిన కొలపూడి కమలాకర్ కుమార్తె కవిత ఖమ్మంలోని ఎస్ఆర్ ఎండీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఆమె ఖమ్మం నుంచి ఇంటికి వచ్చింది. మంగళవారం కుటుంబ సభ్యులు రోజువారీ పనినిమిత్తం బయటకు వెళ్లారు. వారు వెళ్లిన కొంతసేపటికే కవిత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


రిజర్వాయర్‌లో సైదులు మృతదేహం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని పత్తేపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గల్లంతైన మచ్చ సైదులు మృతదేహం మంగళవారం లభ్యమైంది. నేరేడుచర్ల ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తేపురం వద్ద గల నాగార్జునసాగర్ ఎడమ కాలువ వద్దకు మచ్చ సైదులు ఈనెల 1న ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఈయన మృతదేహం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో మంగళవారం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడి తల్లి పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండల పరిధిలోని మంగమ్మగూడెంలో ఓ వ్యక్తి కడుపు నొప్పి భరించలేక మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగమ్మగూడేనికి చెందిన కడారి పెద్ద వీరయ్య(80) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి భోజనం చేసి ఇంటి వరండాలో పడుకున్నాడు. చికిత్స పొందినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టు కొమ్మకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం కుంటుబ సభ్యులు చూసేసరికి ఇంటి ఎదుట లేకపోవడంతో వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోవర్ధనగిరిధారిగా నృసింహుడు


గోవర్ధనగిరిధారి అలంకరణలో స్వామివారు

- ఉదయం వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చిన యాదాద్రీశుడు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ప్రారంభమైన అధ్యయనోత్సవాలు మంగళవారం రెండవ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారిని వేణుగోపాల స్వామి (మురళీకృష్ణుడి)గా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు అలంకార సేవకు హారతినిచ్చి తిరువీధి సేవోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఆళ్వారులు కీర్తించిన ప్రబంధాల్లోని పాశురాలను అనుసంధానం చేశారు. ప్రధానాలయం తిరు, మాఢవీధుల్లో విహరిస్తున్న శ్రీస్వామి వారి సేవ ఎదుట పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు పాశురాలను పఠించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీస్వామి వారిని ఆలయంలో నిత్యారాధనల అనంతరం రాత్రి ద్రావిడ ప్రబంధ సేవా కాలం నిర్వహించారు. ప్రథమ ప్రాకార మండపంలో స్వామివారిని గోవర్ధనగిరిధారిగా అలంకరించి తిరు, మాఢవీధుల్లో ఊరేగించారు.

అలంకరణ పట్ల అశ్రద్ధ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అలంకరణ సేవల్లో అశ్రద్ధ కనిపిస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన గోవర్ధనగిరిధారి అలంకార సేవలో గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలుతో శ్రీస్వామి వారు ఎత్తిన దృశ్యాన్ని థర్మకోల్ షీట్‌పై తయారు చేసి పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గోవర్ధన పర్వాతాన్ని ఎత్తుకునే దృశ్యం భక్తుల కళ్లకు కట్టినట్లు చూపెట్టిన ఆచార్యులు, ఈ సారి మాత్రం థర్మకోల్ షీట్‌పై తయారు చేసి పెట్టడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

గతేడాది నిర్వహించిన అధ్యయనోత్సవాల్లో గోవర్ధన పర్వతాన్ని ఎత్తుకొని ఉన్న దృశ్యం (ఫైల్)



కంటెయినర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కంటెయినర్

మిర్యాలగూడ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములపల్లి గ్రామ శివారులోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన చిలుక వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి ద్విచక్ర వాహనంపై శెట్టిపాలెం వెళ్లి తిరిగి వేములపల్లికి వస్తున్నారు. శెట్టిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిని దాటుతుండగా అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపునకు వెళ్తున్న కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చిలుక వెంకట్‌రెడ్డి కుడి చేయి విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. నారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తీవ్ర గాయాలపాలైన చిలుక వెంకట్‌రెడ్డిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మంగళవారం హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో ముందుగా వెళ్తున్న బైకును ఢీ కొట్టిన అనంతరం ముందున్న మరో కారును, బైకును ఢీ కొట్టింది. దీంతో బైకు మీద వెళ్తున్న జనగాం మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన భవానీ, రాజుతో పాటు యాదగిరిగుట్ట మండలంలో దాతరపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తేజంరెడ్డి తెలిపారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రమేష్

కట్టంగూర్ : మద్యం సేవించొద్దని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఈదులూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన పోలగోని రమేష్(46) సోమవారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గమనించిన భార్య మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న రమేష్ క్షణికావేశంలో తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం వ్యవసాయ బావివద్దకు చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంట్లోని సామగ్రి

నకిరేకల్ : గ్యాస్ సిలండర్ పేలి ఇళ్లు దగ్ధమైన సంఘటన నకిరేకల్‌లోని చీమలగడ్డలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పర్వతం నాగరాజు, శంకరమ్మ దంపతులు నకిరేకల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు జంగాల కాలనీలో నివాసముంటున్నారు. రోజు మాదిరిగానే శంకరమ్మ ఉదయం అన్నం వండేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించింది. సిలిండర్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు లేవడంతో భయంతో బయటకు పరుగులు తీసింది. సిలండర్ పేలి పెద్దఎత్తున మంటలు లేచి ఇళ్లు దగ్ధమైంది. నాగరాజు నిమ్మ తోటల పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటిలోని దాచుకున్న రూ.2లక్షల నగదు, వంట సామగ్రి, బియ్యం, పిల్లల స్టడీ సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.5 లక్షల పైనే నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. సంఘటనా స్థలాన్ని టీపీసీసీ నేత దైద రవీందర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ప్రవీణ్

ఆలేరురూర్ : ఆలేరులో సోమవారం రాత్రి ప్రవీణ్ అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. భువనగిరి జీఆర్పీ కానిస్టేబుల్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ప్రవీణ్ ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం ఆలేరుకు వచ్చాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఆఫ్ లైన్ ట్రాక్‌పై గూడ్స్ రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్యకు యత్నించాడు. రైలు ఢీకొట్టే క్రమంలో పక్కన పడిపోవడంతో తల, చేతికి గాయాలయ్యాయి. అదే రాత్రి అతడిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించామని, చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన ఉపేందర్

తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడం వల్ల ఒకరికి తీవ్రగాయలై పరిస్థితి విషయంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన తిరుకోవలూరూ ఉపేందర్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి మోటర్‌సైకిల్‌పై వస్తున్న బిచ్చాల రాజు మాదాపూర్ వద్ద ఎదురుగా ఢీ కొనడంతో ఉపేందర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. రాజుకు స్వల్ప గాయలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపేందర్‌రావును భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు హైదరాబాద్‌కు తరలించారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని దాస్‌తండా గ్రామంలో మంగళవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహం ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయిన గ్రామానికి చెందిన నునావత్ మహేష్(20)దిగా పోలీసులు గుర్తించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన మహేష్ కోసం తండ్రి హాతీరాం వెతుకుతున్నాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో లాలు వ్యవసాయ బావిలో శవమై కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా.. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

పోలీసులు దూషించడంతోనే..

- తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పాలకవీడు : ఓ ప్రమాద ఘటనలో అకారణంగా పోలీసులు స్టేషన్‌కు పిలిపించి దూషించడంతోనే తమ కుమారుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుడి తల్లిదండ్రులు పాలకవీడు మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్, లతీఫ్‌బీ, వారి బంధువులు ఆరోపిస్తూ మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షేక్ నాగుల్‌మీరా(20) డిసెంబరు 31 రాత్రి స్నేహితులతో కలిసి బైక్‌పై గుడుగుంట్లపాలెం నుంచి పాలకవీడుకు వెళ్తున్నాడు. అదే సమయంలో పాలకవీడు గ్రామానికి చెందిన పగడాల జ్యోతిబసు, యరగొర్ల సైదులు పాలకవీడు నుంచి గుడుగుంట్లపాలెం వైపు బైక్‌పై వస్తుండగా భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో తమ కుమారుడు వెళ్తున్న వాహనాన్ని ఢీ కొట్టారని ఆరోపించారు. ఆ సమయంలో తమ కుమారుడి కాలుకు స్వల్ప గాయాలు కాగా.. పగడాల జ్యోతిబసుకు తీవ్ర గాయాలు కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరుసటి రోజు జనవరి 1న పగడాల జ్యోతిబసు కుటుంబ సభ్యులు ప్రమాద ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తమ కుమారుడిని స్టేషన్‌కు పిలిపించి ప్రమాదానికి కారణం నువ్వే అని దూషించడంతో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు వాపోయారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సంబంధం లేని కేసు విషయంలో తమ కుమారుడిని ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి దూషించాడని, ఈ కారణంగానే మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు స్టేషన్ ఎదుట మృతదేహంతో బైఠాయించి ధర్నాకు దిగారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామలింగారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. బుధవారం ఉదయం జ్యోతిబసు కుటుంబసభ్యులను కూడా పిలిపించి మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. అయినా కుటుంబ సభ్యులు భీష్మించుకుని కూర్చున్నారు. ఈక్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తండ్రి మందలించడంతోనే..

ఈ విషయంపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ షేక్ నాగుల్‌మీరా, అతడి స్నేహితులను పిలిపించి విచారించామని, చిన్న వయసులో తాగి రోడ్లపై ప్రమాదాలకు కారణం కావడం మీ భవిష్యత్‌కు మంచిది కాదని హెచ్చరించామని తెలిపారు. అయితే అదే రోజు సాయంత్రం ఇంటికి వెళ్లిన నాగుల్ మీరాను తండ్రి మందలించడంతోనే మనస్తాపానికి గురై ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు వెల్లడించారు. ఇందులో పోలీసుల తప్పిదమేమీ లేదని పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఇరువురి కుటుంబాలను స్టేషన్‌కు పిలిపించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటామని తెలిపారు.

నూతన డీజీపీని కలిసిన బెటాలియన్ కమాండెంట్

నల్లగొండ క్రైం : నూతన డీజీపీ అంజన్‌కుమార్‌ను అన్నెపర్తి బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


డీజీపీని కలిసిన కమాండెంట్ సాంబయ్య

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బీబీనగర్ : బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో డిసెంబర్ 31న అనారోగ్యానికి గురైన గుర్తు తెలియని సుమారు 60సంవత్సరాల వ్యక్తిని రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టంపల్లి సర్పంచ్ పనస సైదులు, అదే గ్రామానికి చెందిన రామస్వామితో కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి కట్టంగూర్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు వెళ్లగానే విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆస్పత్రికి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేల ఆర్థికసాయం చేశారు.

ట్రాక్టర్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో..

పామనగుండ్ల గ్రామానికి చెందిన రైతు పల్లె నరేష్ తన కుటుంబ సభ్యులతో వ్యవసాయబావి నుంచి ట్రాక్టర్‌పై ఇంటికి బయలుదేరారు. పామనగుండ్ల బస్‌స్టాప్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను దాటే క్రమంలో మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న నరేష్, కళ్యాణి, మణిదీప్, మహాలక్ష్మి, రిత్వికలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్షతగాత్రులను పరామర్శించారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


సాక్షి, యాదాద్రి : పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌర హక్కులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో బాధితులకు అందజేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది రూ.70,00,000 అందజేసిందని వెల్లడించారు. సమావేశంలో సభ్యులు, శివలింగం, సుదర్శన్, నర్సింగరావు, తిరుమలేష్, రాజన్ నాయక్, భాస్కర్, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

సూర్యాపేటటౌన్ : సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి ఆదర్శనీయని శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మొట్టమొదటిసారిగా కుల వ్యవస్థ ఆధిపత్య మత దురహంకారంపై తీవ్రమైన స్వరంతో తిరుగుబాటు చేసిన గొప్ప సామాజిక ఉద్యమకారులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, బీవీ రావు, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, డేవిడ్‌కుమార్, సందీప్, కిరణ్, హరీశ్ పాల్గొన్నారు.

టీఆర్ఎస్ పాలనలో పెరిగిన అవినీతి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక భూ కబ్జాలు, అరాచకాలు, ఆక్రమణలు, ఇసుక దందాలు, అవినీతి ఎక్కువయ్యాయని రాష్ట్ర బీజేపీ నాయకులు, సూర్యాపేట నియోజకవర్గ అసెంబ్లీ పాలక్ రేవూరి ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలింగ్ బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని పట్టణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వ భూములను అమ్ముతున్నారని విమర్శించారు. సూర్యాపేటలో ప్రభుత్వ భూములు, గుట్టలు కనుమరుగవుతున్నాయని, ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారుని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అబీద్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, రాష్ట్ర నాయకులు తుక్కాని మన్మథ రెడ్డి, కౌన్సిలర్లు పలస మహాలక్ష్మి, కట్కూరి కార్తీక్ రెడ్డి, సలిగంటి సరిత, జిల్లా నాయకులు గజ్జల వెంకటరెడ్డి, నరసింహ, మల్సూర్ గౌడ్ పాల్గొన్నారు.

సామాజిక సేవలకు గుర్తింపు


లింగంగౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు


పూలే అవార్డు అందుకుంటున్న పద్మ


ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య


పోతిరెడ్డిపల్లి సర్పంచ్ మాధవి

మిర్యాలగూడ టౌన్ : వివిధ సామాజిక రంగాల్లో కృషి చేసినందుకుగాను మిర్యాలగూడకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, మహిళా నాయకురాలు జయమ్మ సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, మునిమంజరిలు ఈ అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు.

పద్మను వరించిన సావిత్రిబాయి పూలే అవార్డు

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నిమ్మల పద్మ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పద్మను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, మెమొంటో, సర్టిఫికెట్ అందించారు. అవార్డు రావడం పట్ల పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శైలజ, రామ్మోహన్, శ్రీనివాస్, శంకర్, కర్ణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

పోతిరెడ్డిపల్లి సర్పంచ్ మాధవికి అవార్డు

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గనగాని మాధవి సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. గ్రామ స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవలకు గుర్తింపుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు.

అవార్డు అందుకున్న లావణ్య

భువనగిరి : భువనగిరికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటికాల లావణ్య రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఆమె నిర్వహించిన సామాజిక సేవ కార్యక్రమాలకు గాను మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నారు.

తుర్కపల్లి వాసికి పూలే అవార్డు

తుర్కపల్లి : మండల కేంద్రానికి చెందిన బాలల సంక్షేమ సమితి సభ్యురాలు కళాశికం రుద్రమదేవి చేసిన సామాజిక సేవ కార్యక్రమాలకు గాను రాష్ట్ర బీసీమహిళ సంఘం మంగళవారం సావిత్రిబాయి పూలే అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా రుద్రమదేవిని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ బండారు జయశ్రీ, సీడబ్ల్యూసీ సభ్యుడు మల్లేశం, శివరాజు, డీసీపీఓ సైదులు, దశరథ అభినందించారు.